సారయ్య నన్ను వింతగా చూశాడు.

మార్కెట్టు దగ్గరగా, ఎప్పుడూ రణగొణ ధ్వనులతో, ఇరవై నాలుగు గంటలూ బిజీగా ఉండే లొకాలిటీలో ఇల్లు కావాలన్నప్పుడు.

కూరగాయల మార్కెట్టు, రెండు సినిమా హాళ్ళు, బస్టాండు దగ్గరగా ఉన్న ఒక ఇరుగు వీధిలో ఇల్లు కుదిర్చాడు. ఆ ఇంటికి దగ్గరగా పెద్ద స్లమ్! రిక్షా కార్మికులు, రోజువారీ కార్మికులు, పని మనుషులు, రకరకాల చిన్న చిన్న పనులు చేసి జీవనం వెళ్లబుచ్చే జన సమూహం అక్కడుంటారు. రాత్రి కొన్ని గంటలు తప్ప

# బంగారు తల్లిరో

**–గంటి రమాదేవి**

అక్కడ నిశ్శబ్దమన్న పదమే లేదు. నాకదే కవాలి.

నిశ్శబ్ద శబ్దం అంటే నాకు భయం! తాత్కాలిక మృత్యుకుహరం లాటి గాఢ నిద్రావస్థలో తప్ప నాకు నిశ్శబ్దమంటే వెరపు.

ఉలిక్కిపడి లేచాను.

మంద్రగా వస్తోందా స్వరం - తెరలు తెరలుగా, అలలు అలలుగా -

''బంగారు తల్లిరో, రేకుల్లేని పువ్వురో''.

జోలపాట

పాటలో మాధుర్యం కన్నా, విషాదం, దీనత్వం, నిస్సహాయతనం నన్ను లేపి కూచోబెట్టాయి.

కిటికీ తలుపు తెరిచి చూశాను.

రెండో ఆట సినిమా ఎప్పుడో వదిలేశారు. నలభై కాండిల్ వీధి దీపం చుట్టూ వలయాకారంలో పొగమంచు దాడికి సిద్ధమవుతోంది. గూఢచారుల్లా ఆ వలయంలో ఎగిరే పురుగులు.

గుడిసెలుండే కాంపౌండు వాల్ నిండా సినిమా పోస్టర్లు, పిడక గుర్తులు. చిరంజీవి ఫైటింగ్ సీన్ సినిమా పోస్టర్లు!

ఆ స్వరం అక్కడి నుంచే వస్తోంది. గుడిసెలో నుంచి తన బాధను వ్యక్త పరచలేని చంటిపిల్ల ఏడుపుకు చల్లని మందులా - జోలపాట.

ఇక నిద్రపట్టదు...

సిగరెట్టు పెట్టెలో నుంచి సిగరెట్టు వెలిగించి ఒక దమ్ము పీల్చాను-

దగ్గు వచ్చింది. కొత్తగా చేసుకుంటున్న అలవాటు. ఆరోగ్యం క్రమంగా క్షీణిస్తుంటే ఆనందంగా ఉంది...

జయ దగ్గరకు తొందరగా వెళ్లాలి... తను నా దగ్గరికి రాలేదు.. ఆరోజు...

ఫోను చేసింది జయ...

''శుభవార్త...'' అంది.

తేనె తుట్టెకు తగిలిన రాయిలా, ఆ మాట నాలో ఎన్నో ఆలోచనలు రేకెత్తించింది. జయ మళ్లీ నీళ్ల పోసుకుందా?

పెళ్లయిన నాలుగు నెలలకే ఆ వార్త చెప్పింది. సంతోషం కలిగించింది. ఎక్కువగా కాదు - మామూలుగా అప్పుడు.

ఎదురు చూస్తున్న వార్త కాదు. మరీ ఎక్కువ థ్రిల్ ఫీల్ కాలేదు. అందుకే. నెలలు గడుస్తున్న కొద్దీ పుట్టబోయే పసివాడి మీద (పసి'వాడే' అని జయ'వాదం') వాత్సల్యం పెరిగిపో సాగింది. పుట్టకుండానే మా జీవితాలు నిర్దేశించడం మొదలు పెట్టాడు వాడు.

పిల్లవాడి కోసం తనకిష్టమైన వీణ సాధన చెయ్యడం మానివేసింది. ఒకరి దగ్గరే చాలాసేపు కూర్చుంటే మంచిది కాదు అని.

నేను డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు చదవడం మానేసాను. ఎక్కువ సమయం జయకు ఇవ్వాలని.

ప్రతి చిన్న విషయాన్ని శ్రద్ధగా పాటించాం ఇద్దరం. వారం వారం పరీక్ష చేసిన డాక్టర్లు ''ఫైన్..ఫైన్..'' అంటూనే ఉన్నారు. అదే జోలపాటగా మారి హాయిగా నిద్రపోయే వాళ్లం... కాని...

పుట్టి మునిగే వార్త తెలుస్తుందని వాస్తవంలోనూ, కలలోనూ అనుకోలేదు.

కెవ్వున ఏడ్చే పాపాయి కోసం ఎదురు చూశాం. ఏడ్పించే నిర్జీవ ప్రతిమ లభించింది. నెలలు నిండగా, నిండగా ఉమ్మెత్త ఉంగాలు, బోసినవ్వులూ ఉంటాయని కలలు కన్నాం - బరువెక్కిన గుండెలూ, ఆ గుండెల్లో కుంభవృష్టి కురిపించే కారు మేఘాలు, కన్నీటికి ఆనకట్టలు కట్టే నీలినీడలు తప్ప ఏమీ మిగలలేదు.

మనుషులతో విలాసంగా ఆడుకునే క్రీడాకారుడు ఆ భగవానుడు మళ్లీ తాయిలం చూపించాడు. చేతిలో పడి కింద చిందిన అమృతం ఒక్కసారే అనుకున్నాం... రెండోసారి అదే చోట పిడుగు పడటం అనేది జరగనే జరగదు... నేనూ, జయ ప్రకృతి నియమానికి విరుద్ధమేమో మళ్లీ మా మీదే పిడుగు పడింది. ఈసారి నాలుగో నెలలోనే ఎక్కువ ఆశ చూపకుండా తానిచ్చిన బిడ్డను తానే తీసుకున్నాడు... ఆయన... ఆయనకు కృతజ్ఞతలు... కృతజ్ఞతలు.

ఇది మామూలు విషయమైనట్టు, అందరికీ ఇది మామూలయినట్టు జయ నటిస్తూంటే, అది నా కోసమని, నాకున్న ఆశలు నేలకూలేసరికి భరించ లేననుకుని, నేనూ అలాగే చేసాను. అంతరాంతరాల్లో,




నిక్షిప్త సాగరాలు ఘోషిస్తూనే ఉన్నాయి. మా చెవులకే వినపడతాయి ఆ నిర్ఘర ధ్వనులు.

''ఏమిటది? జయా'' అన్నాను నిబ్బరంగా, ఆలోచనలాపి.

''మీరు పరీక్షలో పాసయ్యారు. మార్కండేయులన్నయ్య గారు చెప్పారు. మీ ఫోను దొరకలేదుట. నాకు చెప్పి వెళ్లారు'' రెండోసారి జయకు అలా అనగానే, అది మర్చిపోవాలని పరీక్షలకు చదివాను. దాని ఫలితం ఇది, నాక్కావలసింది ఇది కాదు...

''అంతేనా?''

''అంతే కాదు.. ఇంకా ఉంది...''

ఉత్కంఠతో ఎదురు చూస్తున్నాను.. ఏం చెబుతుందో జయ.

''డాక్టరు చెప్పింది... మూడోనెల''.

ఈ వార్త విన్న సంబరం ఒక్క క్షణంలో నీరు కారిపోయింది.

''ఈసారి సక్సెస్ జయా!'' అన్నాను. నా మాట నాకే పేలవంగా అనిపించింది. రెండుసార్లు దెబ్బతిన్నాను. ఫీర్‌లెస్ ఫీర్స్...

''డాక్టరు అదే అంది''

ఇదివరకూ అన్నారు... డాక్టర్లు... కాని ఏమయింది!...

''మరో మాట... ఈసారి సంక్రాంతికి మా ఊరు వెళుతున్నాం. పది రోజులు'' అంది ఉత్సాహంగా జయ.

జయ పుట్టింటికి వెళ్లి చాలా రోజులయింది... కొంత మార్పు కావాలనిపించింది నాకే. ఈ డైవర్షన్ మంచికే...

''సరే ...''

''మా ... అన్నయ్యా పిల్లలూ, బావగారూ, పెద్దక్కా - 'పిలానీ' నుంచి మా తమ్ముడు లచ్చులూ వస్తున్నారట. సంక్రాంతి కదీ పిల్లల కోసం భోగీ దండలు వేసి ఉంచారుట. చిన్నవాళ్లకి చిన్నవి, పెద్దవాళ్లకి పెద్దవి మనకిద్దరికీ వేసారుట. నిలవ పిండివంటలు మొదలెడుతున్నారుట. తేగలు తంపటేస్తారు. మీరొచ్చిన తర్వాత' అని రాసింది జ్యోతి''.

''శనివారానికి బస్సులో టిక్కెట్లు బుక్ చేస్తాను'' అన్నాను ఉత్సాహంగా.

సంక్రాంతి అంటే చిన్నప్పట్నుంచి నాకు సంబరమే. చల్లగా ఉంటుంది. చిరు చలి రాత్రి, ఆకాశం నిర్మలంగా ఉంటుంది. సంవత్సరంలో మంచి టైం.

ఆటలు, పందేలు, పరమాన్నాలు, పేకాటలు, సినిమాలు, సరాదికాలూ అన్నీ గుర్తుకు వస్తాయి సంక్రాంతి పేరు వింటే.

★ ★ ★

వేడి పెసరట్టు తిని, చిక్కటి కాఫీ తాగి బయటపడ్డాం. ఎవరైనా మాతో వస్తారా అనడిగా. ఎవరూ రానన్నారు. మాకు అదే కావాలి. కంకర రోడ్డు మీద కాలువ గట్టు వెంబడే నడిచి, చిన్న తాటి స్తంబపు వంతెన దాటి అవతల గట్టుకొచ్చాం. సంక్రాంతికి వరిచేలు కోసి బీడుగా ఉండేవి భూములు. ఇప్పుడిది మారిపోయింది. ఒక్క అంగుళం కాళీ

లేకుండా పచ్చటి వరిచేలు. ఇంకా పూతకి రాలేదు. కొన్ని చేలల్లో జనప మొక్కలు. అందమైన పసుపు పచ్చపూలు ఒక వరుసలో పూచినట్టు. గట్లమీద కంది చెట్లు ఆనందంగా 'తలలూపుతున్నాయి ఆ వరుసపూలు చూసి. అవీ పూస్తున్నట్టు తెలియక 'స్వల్పకాలిక పంటలతో' చాలా మార్పులొచ్చాయి వ్యవసాయంలో'.

చాలా దూరం వచ్చేసాం...

జయ జరీ అంచు ఆకుపచ్చ చీర కట్టింది. మచ్చలేని చంద్రబింబం లాటి జయ ఈరోజు మరింత అందంగా ఉంది. తనవారిని చూసిన ఆనందం. పుష్యమాసపు ఎండ కొంచెం చురుగ్గానే ఉంది. చలిగాలి శరీరాన్ని ఇంకో పక్క కోస్తుంటే చురుక్కుమనే ఎండ ఒక పక్క తగులుతూంటే ఏదో కొత్త శక్తి వచ్చినట్టు జయ గెంతుతూ నడుస్తోంది చేల గట్లమీద.

బూడిద రంగులో ఉండే కొంగలు ఒక్కసారి లేచాయి... ఎగిరేటప్పుడు తెల్లగా ఉన్నాయి. మొసపు కొంగలు...

వడ్రంగి పిట్ట గట్టుమీద ఉన్న చెట్టుని 'టక్ టక్' మని శబ్దం చేస్తూ పొడుస్తోంది. ఆ నిశ్శబ్దంలో అది మైదానంలో ధ్వనించే రైలు శబ్దంలా ఉంది. ఛుక్ - ఛుక్ - ఛుక్

జయ గట్టిగా నవ్వింది... ఎందుకనడిగాను.

''పిచ్చి వడ్రంగి.. టక్కు టక్కు మనే బదులు, ఆ కొంగలా నిశ్శబ్దంగా చేపలు పట్టుకోవచ్చుగా''.

నేను ఫక్కున నవ్వాను, పగలబడి నవ్వాను.

అలా నవ్వి ఎన్నాళ్ళయింది.. నా నవ్వు చూసి జయ నవ్వు. చురుక్కుమనే ఎండలో కరుకుతనం తగ్గింది.

విసరుగా చలిగాలి...

తలెత్తి చూసాను.. ఎప్పుడొచ్చాయో మాయదారి మేఘాలు. టప టప చినుకులు. దూరంగా వంటి రాట గుడిసె.

''జయా! వానొస్తోంది. పరిగెత్తు - ఆ గుడిసెలో ఆగుదాం'' అని ముందు నేను పరిగెత్తాను. ఎవరూ లేరు... అక్కడ. పరుగున వచ్చింది జయ కూడా.

చుక్క చుక్కగా కురుస్తోంది లోపల కూడా. వానలేని చోట దగ్గరగా నిలబడ్డాం. మరీదగ్గరగా ఓ



**అందుకే**

''నాయనా! నువ్వు, నిత్య సత్యాన్వేషివి కావాలి'' అన్నాడు గురువు, తన ఆశ్రమానికి వచ్చిన యువకుడితో.

''చిత్తం స్వామీ! నేను నిత్యం, నా సత్యని వెతుకుతూనే, మీ ఆశ్రమంలో గాని ఉందేమోనని ఇలా వచ్చాను'' అన్నాడా యువకుడు.

-ఎ.ఎస్.అంబిక (హైదరాబాద్)

మూల...

గూడు అల్లుకుంటున్న సాలీడు మా రాక చూసి భయపడి అల్లడం మానేసి మూలగా నక్కింది.

వాన మరీ పెరిగింది. లోపల ధారగా పడుతున్నాయి నీళ్లు. జయ తల తడిసిపోతూంది. ఆ తల కొంచెం వంచి నా చొక్కా కప్పాను. తడిసిపోయిన ఆమె మొహం తళుక్కున మెరిసింది. ''పూలు నలిగిపోతున్నాయి'' అంది నవ్వి.

తోటలో పూచిన గులాబీ దండ రేకులు విడిపోయి నేలమీద పడ్డాయి. రెండు రేకులు నా నోట్లోకి వచ్చాయి వగరుగా.

భయం పోయిన సాలీడు మళ్లీ గూడు అల్లడం



**గతస్మృతులు**

అందాల దివ్యభారతి చనిపోయిన తరువాత ఆమె జ్ఞాపకాలను మాత్రం మరిచిపోలేకపోయున్నాడట ఆమె ప్రియుడు, నిర్మాత సాజిద్ నడియద్ వాలా..! అందుకనే కాబోలు అచ్చుగుద్దినట్టు దివ్యభారతిలాగే ఉండే బందరు మిఠాయి రంభను తన సినిమాలో కథానాయికగా బుక్ చేసేశాడు సాజిద్..! అంతే కాదు రోజుకొక్కసారైనా రంభతో మాట్లాడకుండా నిద్రపోవడం లేదుట. ఒకవేళ బొంబాయిలోనే ఉంటే ఆమె రూము చుట్టూ తిరుగుతూనే ఉంటున్నాడట!

-కృష్ణవే

మొదలు పెట్టింది. మళ్ళా జయని కలుపుతూ. మా కంటి చుట్టూ అల్లుతోంది. నా తల మీద నుంచి ఆమె మొహం ముఖం మీదుగా జోరుజోరుగా దారాలుగా అల్లుతోంది. జయ ఒక వేలితో ఆ చిన్ని పురుగుని తీసింది నవ్వుతూ. అది వేగంగా కిందికి జారింది తన అల్లుతున్న దారం ఆధారంగా.

బయట వాన తగ్గలేదు.

''శీతాకాలం వాన'' అంది జయ.

గబుక్కున ఆమె చుబుకాన్ని ముద్దు పెట్టుకున్నాను.

జయ దీర్ఘ శ్వాస వదిలింది. ఆమె కళ్లు మెరుస్తున్నాయి. గుండ్రని ఆమె ముఖం, నల్లటి మేఘాల మధ్యన ఉన్నట్టు - విడివడిన ఆమె కురుల మధ్య.

ఆమెను దగ్గరగా పొదివి పట్టుకున్నాను.

ఆ దివ్యమైన ముఖం, ఫొటో ఫ్రేములా నా మనసులో శాశ్వత ముద్ర వేసుకుంది. శిలపై చెక్కిన శిల్పంలా... శిల్పం...


జయ నేలకొరిగే దాంతవరకు నాకు తెలియలేదు. జారిపోయింది నేలకి.


చల్లనిస్తుందనుకున్న చెట్లు, నీడ కూడా ఇవ్వకుండా కూలిపోయింది. సుఖ నిద్రనిస్తుందనుకున్న చెఱుకు బాణంలా వెనక్కి వెళ్లి మెదడుని చీల్చేసింది. జయ ఇంటిలో ఆ సంక్రాంతి ఎవరూ మరిచిపోలేరు. ఇక మీదట అక్కడ సంక్రాంతి లేదు.

జయ నిర్జీవ శరీరం లాగే నా [illegible] ప్రాణవాయువు విడిచేసింది. మనసు చచ్చినా శరీరం బతికే ఉంది. బరువుగా ఆ ఊరు నన్ను వదిలేసింది.

ఆ జోలపాట నా గుండెలో కలుక్కుమంది. అర్ధరాత్రిలో ఇక్కడ... జయ పాడేది ఆ పాట. తెలుగుదేశంలో ఎంతో మంది తల్లులు పాడే పాట అది. బాధ, ఏడుపూ మర్చి, హాయిగా నిద్రపోయేటట్టు చేసే పాట.

జయ జ్ఞాపకాలతో ఆ రాత్రి నిద్రపట్టలేదు. జయ మళ్లీ పుట్టిందా ఎక్కడైనా తనపాటే తనే వింటోందా? అది ఎంత అవివేకమైన ఆలోచనో అప్పుడు నాకు





తప్పలేదు. అది అసాధ్యమనీ తోచలేదు...

మరో ఆలోచన - జయలాటి మరో మనిషి.. ఇక్కడ!

ఆ ఆశ నన్ను లాక్కుపోయింది ఆ ఇంటికి వెళ్లాగానే -

''ఎవరు కావాలి?'' సన్నని వణికే గొంతు.

''ప్రక్క ఇంట్లో ఉంటానమ్మా... ఆ... మాకో పనిమనిషి కావాలి'' అవసరానికి పనికొచ్చే అబద్ధం.

ఆమెను చూడాలి... జయలాగే ఉంటుందా? ఎలా ఉంటుంది?

జయ గొంతులాగే మృదువుగా, గుండె లోతుల్లోకి ఇంకిపోతూ కాని రూపం ఎలాటిదో. ఆమె బయటకు వచ్చింది.

నెరిగిన నీరె - బడుగు శరీరం - ముఖం మీద ముడతలు. బ్రతుకు భారంతో క్రుంగిన నడుం - పేదరికం. మూర్తీభవించిన స్వరూపం. ఎక్కడా పోలిక లేదు.

''అయ్యో - ఎవరు కావాలి?''

''పని మనిషి''

ఆమె నాకేసి పరీక్షగా చూసి అంది.

''ఇక్కడెవరూ లేరు. కావాలంటే''

''వద్దు. ఎక్కువ పనేముండదు. మా పాపకు నీళ్లు పోసి ఆడించాలి. జోలపాట పాడాలి. అంతే''.

''పాపను ఆడించాలా?... అంతేనా..''

ఆ మనిషిని చూస్తేనే తెలుస్తుంది. రోజూ తిండి గడవటమే కష్టంగా ఉందని. ఎప్పుడు, ఎలా వస్తుందో తెలియని తిండి కోసం ఎదురు చూసి చూసి ఆమె కళ్లు గుంటలే పడ్డాయి. కాని పాప పేరు వినగానే ఏదో మెరుపు. చాలు అది.

మర్నాడే పనిలోకి వచ్చింది.

''పాపేది?''

ఒక బొమ్మ ఇచ్చాను.

''పాప వస్తుంది కొన్నాళ్లల్లో. అంతవరకు ఈ బొమ్మతో అలవాటు చేసుకో''

నిరాశ చోటు చేసుకుంది ఆమె ముఖంలో. అప్పటికే నెలజీతం ఇచ్చాను. రోజూ నాకు టిఫినూ, కాఫీ చేసి ఇవ్వాలి. రాత్రి వంట చేసి పెట్టాలి. తిండికి ఎదురు చూసే పని లేదు.



## నిజం

''మీ ఇద్దరూ మొగుడూ, పెళ్లాలంటే నాకనుమానంగా ఉందే'' అన్నాడు ఎస్.ఐ. లాడ్జి రైడింగ్‌లో దొరికిన వారిని ప్రశ్నిస్తూ.

''అవునండీ! నిజం! నేను మా ఆవిడకు మొగుడ్ని, ఆవిడేమో మా ఎదురింటాయన్కి పెళ్లాం'' చెప్పాడు అతను వినయంగా.

-అకసం మూర్తి (కాకినాడ).

నాకు పాటలిష్టమని చెప్పాను. నాలుగు రోజుల తర్వాత, బొమ్మను తీసుకుని పాడడం మొదలు పెట్టింది... ఎన్నో పాటలు. అన్నీ పాతవే అయినా... పరిసరాల్లో ఉన్న రణగొణ ధ్వనులు అప్పుడు వినపడేవి కాదు. ఆ కంఠంలో ఉన్న మాధుర్యానికి అవి నిస్తేజమయ్యేవి. ''బంగారు తల్లిరో చుక్కల్లోని చుక్క చందమామవే మా పాప... చిన్ని పాదాల సిరిసిరి పాప... ముద్దు నవ్వుల మురిపాల పాప...''

కళ్లు మూసుకుని విన్నాను.

జయే ఆ గదిలోకి వచ్చినట్టు.

తల తిప్పుకున్నాను - ఆ ముసలామె చూడకుండా.

నా కంటిలో, గోదావరీ, కావేరీ నదులు!..



క్రమంగా రోజులు గడుస్తున్నాయి..

ఆమె పేరు, ఊరు జరిగిన జీవితం తెలుసుకున్నాను. పేరు అల్మేల్ మంగ. పేదరికంలో పుట్టిన మంగకి చిన్నప్పుడే పెళ్లయిందిట. తామర తంపరగా పిల్లలూ పుట్టారుట. మొగుడు పోయాడు. పిల్లలందరూ ఎవరి దారిన వాళ్లు పోయారు. ఇప్పుడెవరూ రారుట. అల్మేలు మంగ ఇప్పుడు మంగమ్మగా వ్యవహరింప బడుతోంది. శరీరం అలసినా అవసరాలు ఆగిపోవు. శక్తిపోయినా ఆకలి పోదు.

మంగమ్మ పాటతో నా నిద్రకు భంగం కలగటం లేదు ఈమధ్యన. అయితే మరో ఉపద్రవం ముంచుకొచ్చింది... అప్పుడు... మంగమ్మను పోలీసులు అరెస్టు చేసి తీసుకుపోయారు. నాకిదో షాక్. ఏమిటి తన నేరం? ఈ శుష్కించిన శరీరంలో నేరం చేసే శక్తి ఉందా? పోలీసు స్టేషనుకు వెళ్లాను - ఆమె మీద 'చార్జెస్' ఏమిటి అని అడిగాను.

మంగమ్మ హంతకి... పిల్లల్ని చంపుతుంది! మైగాడ్! సెల్‌లోకి వెళ్లి అడిగాను - ''నిజమా?''

నాకు తెలుసు ఆమేం చెబుతుందో- తనకేమీ తెలీదు - ఇది వట్టి బూటకపు కేసు. నిరాధారమైన కేసు అని! వాత్సల్యం నిండిన గొంతుతో బంగారుతల్లిరో అని పాడే మంగమ్మ హంతకి కాదు. ఈ ఆరోపణలో నిజం లేదు అనుకున్నాను.

★ ★ ★

''పోలీసులు చెప్పింది నిజం బాబూ! ఎందరో పసి పిల్లల్ని చంపాను నేను'' మంగమ్మ మాటలు పిడుగులా వినపడ్డాయి.

''ఆడపిల్లలు పుడితే చంపెయ్యాలి. ఎంత గుడిసెల్లో ఉండే వాళ్లయినా, వాళ్ల పెళ్లిళ్లు, పేరంటాలు చెయ్యాలి. వాళ్ల వల్ల ఇంటికేమీ ఆదాయం రాదు...''

మంగమ్మ చెపుతోంది - స్థాణువులా వింటున్నాను.

''మొదటి సారి నాలుగు గుడిసెలావలున్న పార్వతి పిలిచింది. ముసలీ! జాగ్రత్తగా ఇను - నా బిడ్డకి మళ్లా ఆడది పుట్టింది. అల్లుడాడికి తెలిస్తే దాన్నోగొట్తాడు. అది ఏడుస్తాంది. వంద రూపాలిత్తా. దాన్నొదిలించు''.

వంద రూపాయల కాసపడ్డా బాబూ! పాపిష్టిదాన్ని! అప్పటికి తిండి తిని మూడు రోజులయింది. వంద

## కొత్త ప్రేమకథాచిత్రం

మణిరత్నం ఏం చేసినా సంచలనాత్మకంగా ఉంటుంది. మరి! ఈమధ్య అతనిపై జరిగిన బాంబుదాడితో తను తియ్యదలుచుకున్న ఎల్.టి.టి.ఇ. సబ్జెక్టును మూలపారేశాడు. ఇప్పుడు మక్కల్ తిలగం, మాజీ ముఖ్యమంత్రి ఎం.జి.ఆర్, ప్రస్తుత ముఖ్యమంత్రి కుమారి జయలలితల మధ్య జరిగిన ప్రేమాయణాన్ని చక్కటి ప్రేమ కథగా మలిచి సినిమా తీయబోతున్నాడు మణి..!

-కృష్ణాజీ






రూపాలుంటే చాలా రోజులొస్తాయి. పనిచేసే వయసా లేదు. శక్తీ లేదు. తటపటాయించి తప్పుకున్నా రోజులు పసిగుడ్డు. చూపు కూడా సరిగ్గా నిలపలేదు బాబూ. రక్తపు గుడ్డు... ఏడుస్తూ దాని నోట్లో జిల్లేడు పాలు పోసా. గొంతు దగ్గర ఆడుతూన్న నాడి కొట్టుకు కొట్టుకు ఆగిపోయింది. అది చచ్చిపోయింది బాబూ!

ఆ రాత్రి నా కంటి నీళ్లే తాగా బాబూ. సారాతో పాటు - అలా మొదలెట్టా బాబూ నా యాపారం.

అల్లాగ్గ నా పేరు గుడిసెల్లోకి, కొంచెం పెద్దింటోళ్లకీ తెలిసింది. ఒక్కోసారి ఇసం దొరికేది. అది పోసేసేదాన్ని. ఎన్నో పాలు అనుకున్నా అది తాగుతారని''

నాకు తల తిరుగుతున్నట్టుగా అనిపించింది. మంగమ్మ ఏం చెబుతోంది? ఈ ముసల్లి చెబుతున్నది నిజమా? పోలీసుల వాతలకి భయపడి ఇలా చెబుతోంది?

''నీకేం భయంలేదు మంగమ్మా! నిజం చెప్పు''.

మంగమ్మ నా కళ్లల్లోకి సూటిగా చూసి అంది.

''లేదు బాబూ! నే చెప్పిందాంట్లో అబద్ధం లేదు. ఈ ఊర్లో ఆడపిల్లల్ని కనడం అపచారం. ఎలాగా చంపేత్తారు. వడ్లగింజ వేసో, తలగడా నొక్కో, పీక పిసికో - అందుకే ఈ పనికి ఒప్పుకున్నా. ఇదే నాకు బతుకు తెరూ... ఆళ్లకి పాపం చెయ్యలేదని సంతోసం. పుడుతూనే చచ్చేది ఆడపిల్ల. బతుకుతూ సస్తాది... నాలాగా ఎందరిలాగో.. సంపితే బ్రతికిపోతాది. కష్టాలు లేకుండా... కర్కోటకంగా నేనే... చంపా... చంపాను.

మరోసారి -

కొంచెం పెద్దింటోళ్లే -

పసిపిల్లని వదిలించుకోడానికి నన్ను పిలిపించారు.

వయుస్సులో పెద్దాయన. మూడొందలిచ్చాడు. మందు పోయించాడు. పసిపిల్లని గుడ్డలో చుట్టి ఇచ్చాడు.

''ఇదిగో ఈ చుట్ట కాల్చుకో'' అని లంక పొగాకు చుట్టిచ్చాడయ్యా. లోపలెక్కడో తల్లి ఏడుపు వినిపిస్తా ఉంది. బాలింతరాలు... పొత్తిళ్లలో పాప బంగారు బొమ్మ - ప్రాణం విలవిలలాడి పోయింది. దాన్ని చంపాలంటే! చూపు నిలపక పోయినా, నవ్వులొచ్చాయి బుగ్గల్లో - ఎర్రటి నాలుగ బయటకు తీస్తూ ఉంది. అదో ఆట. నల్లటి ఉంగరాల జుట్టు. సంపంగి లాటి ముక్కు. గొప్ప అంతగత్తె అయి ఉండేది. స్మశానంలోకి తీసుకు పోయా. గునపంతో గొయ్యి తవ్వా. ఎండలో పిల్ల కాళ్లూ చేతులూ ఆడిస్తూ ఆడుతోంది. గొయ్యి తీసి అలసిపోయా. సుట్ట వెలిగించా. మందులో ఏం కలిపాడో తిక్క ఎక్కింది. ఎర్రటి మందారం లాటి నాలుక, చిన్ని నాలుక బయట పెట్టింది నాకేమయిందో --

వెలుగుతున్న చుట్ట పాప నాలుక మీద పెట్టా..

బొందల గడ్డ అదిరిపోయేట్టు అరిచింది ఆ పసిది. గుండెలవిసేలా - గుండ్రటి అందమైన కళ్లు - సుళ్లు తిరిగాయి నీళ్లు. నాకు పిచ్చెక్కింది. బాబూ తలుచుకుంటుంటే కడుపు తరుక్కుపోతుంది. సుట్ట ఆ కళ్లలో - ఎర్రటి నిప్పున్న సుట్ట ఆ కళ్లల్లో పొడిచా బాబూ! నన్ను సంపేయండి... తొందరగా సంపేయండి. అందాల పాపను అలా కాల్చేసా. అది ఏడ్చి ఏడ్చి ఆగిపోయింది. శ్వాస ఆగింది. బొందలో పెట్టి పూడ్చేసా.

పని అయిన తర్వాత ముసలాయన్ని కలిసా - ఆ పిల్ల తల్లనుకుంటా కిరసనాయిలు పోసుకుని అంటించుకుందట. ''కూతురా! కూతురా అనేదస్తాన్నాడు - ఆ కూతురి కూతురు కదా - ఈ బంగారు తల్లి''.

మంగమ్మ గొంతు బొంగురుగా వినిపిస్తోంది. పశ్చాత్తాపానికి పాపాన్ని విరిచే శక్తి ఉంటే మంగమ్మ పాప విముక్తు రాలయినట్టే ; కాలే కడుపుకు అప్పటికి దొరికిన ''పని'' చేసింది? ఆడపిల్లని వదిలించుకునే వాళ్ల చేతుల్లో ఆయుధం మాత్రమే ఆమె...

''ఈసారి అయిదు నెలల పాప. బొద్దుగా ఉంది. ముద్దుగా ఉంది. గుడ్డ కప్పితే చిన్ని చిన్ని చేతులతో తీసేస్తోంది. బేరం ఎనిమిది వందలు. తాగిగాని పని చెయ్యలేను. బాగా తాగాను. పిల్లను తీసుకుని ఊరికి దూరంగా ఉన్న రైలు టేసన్ వైపు బయలు దేరాను. ఆ పిల్ల నా ముఖం వైపు పరకాయించి చూస్తోంది. మిలమిల మెరిసే కళ్లు... సూటిగా చూస్తోంది. ''నాకు చావొచ్చింది నీతో'' అన్నా. పక్కున నవ్వింది. బోసినవ్వు. సరదా వేసింది ఆ నవ్వు చూసి. 'చచ్చే చావొచ్చింది' అన్నాను దాని ముఖంలో ముఖం పెట్టి వత్తి పలుకుతూ. అదీ మళ్లీ పక్కుమంది. మళ్లీ అన్నాను ఓ ఆటగా.

అది ఎక్కులు పెడుతూ నవ్వింది. రైలు టేసన్ నాలుగు మైళ్లు. నాలుగు నిమిసాల్లో నడిచినట్టయింది. దానితో ఆడుతుంటే టేము తెల్వలేదు. దాని పీక నులమ బుద్ధి కాలేదు... మనసు రాలేదు.. అందాల బొమ్మ. కొంత సేపటికి బిడ్డ ఏడుపు మొదలు పెట్టింది. ఓ 'టీ' కొని దానికి పట్టా. నాకు మత్తు దిగిపోయింది. ఎనిమిది వందలు తీసుకున్నా - దీన్నెలా సంపడం?

రైలు వచ్చేటప్పుడు పట్టాల మీద పడుకోబెడితే?.. బిడ్డ శరీరం తెగిపోతుంది. అప్పుడే నాకు ఏడుపు ముంచుకొచ్చింది.

దేవుడా? అని బిగ్గరగా అరిచాను బాబూ! కన్నీళ్లాగలేదు. చిత్రంగా చూసిందా చిన్నిపాప. ఉగ్గు గిన్నెలాటి చిన్ని చేతులు నా ముఖాన్ని తాకాయి బాబూ - అది నా కన్నీళ్లు తుడుస్తోంది. నాకే అబ్బురపాలనిపించింది. ఏవమ్మా! నా ఏడుపు సూడలేవా? నిన్ను ఎలా సంపను?...

చిన్నపూరి రైలు టేసన్! పేసింజరీ రైలు వచ్చింది. పెట్టెలన్నీ కాళీ! ఓ పెట్టెలో దాన్ని పడుకోబెట్టి వచ్చా! చూసి సూసి దాన్ని సంపలేకపోయా!

అదెక్కడికి బోయిందో ఏమో?

ఆకలితో సస్తాగాని ఈ పని చెయ్య అని తెగేసి అందరికీ చెప్పా! అప్పటినుంచీ...

చిత్రం! పసిపిల్లల్ని సంపినప్పుడు ఏ పోలీసు పట్టుకోలే! మానేసాక పట్టుకున్నారు.

నువ్వు పెద్ద మారాజుని - నన్ను ''ఉరి'' తీయమని చెప్పు బాబూ!

మంగమ్మ హృదయ విదారకంగా ఏడుస్తోంది. పిల్లలు లేక గుండె పగిలి ఉన్న వాణ్ని నేను.

పిల్ల, ఆడపిల్ల అన్న కారణంగా కర్కోటకపు తల్లిదండ్రుల, తాత అమ్మమ్మల, లేదా నానమ్మల చేతిలో ఆయుధం ఈ మంగమ్మ. వాళ్ల ఏడ్చారో లేదో ఈవిడ పరితపిస్తోంది. తన పాపాలు వెన్నంటి చంపకుండా ఉరితీయమని -

నేనెవరికీ చెప్పనక్కరలేదు.

ఈ కేసు సెషన్స్ కోర్టులో నా దగ్గరకే వస్తుంది. ఈ జడ్జిమెంట్ నేనే ఇవ్వాలి?... బట్ ఏం శిక్ష విధించాలి మంగమ్మకి?



## మళ్లీ మామూలే

నిన్న మొన్నటి దాకా 'నేను ఇహ విప్పి చూపించన'ని గొంతెత్తి అరిచిన మమతా కులకర్ణి మళ్లీ తన పాత పంథాలోకి వచ్చేసింది. సెక్స్ మీద విరక్తి కలిగినప్పుడే 'రక్తి' కూడా కలుగుతుందేమో అనిపించేట్టుగా 'ప్లేబాయ్' మేగజైనుకు నగ్నంగా ఫోజులిచ్చేసిందట ఈ ఆడ మేమన! ఇంత వరకూ ప్లేబాయ్ మేగజైనుకు నగ్నంగా ఫోజులిచ్చిన మొట్ట మొదటి భారతీయ సుందరాంగి మమతా (గుల)కర్ణి మాత్రమే అంటున్నాడు ఫోటోగ్రాఫర్ జేమ్స్ ఎక్సిలాక్సీ!

-కృష్ణాజీ

